
సాక్షి గుంటూరు

మంగళవారం । 7 । మార్చి । 2023



సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2,212 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1050 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.4733 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి రెండు వేల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా 2,200 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. అలాగే జిల్లాలో మరణాలు కూడా ఎక్కడా లేవని వైద్య వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



నృసింహుని బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం నేపథ్యంలో ఎస్పీ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ రామకోటిరెడ్డి, అడిషనల్ ఎస్పీ అనిల్, డీఎస్పీ జె రాంబాబు, పట్టణ సీఐ బి అంకమ్మరావు, ఎస్ఐలు మహేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మర్యాదగా మెలగండి


పల్నాడు డీఈవోకు జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా సూచన

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా దూషించారనే కారణంతో ఉపాధ్యాయలోకం నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న పల్నాడు డీఈఓ ఎం.వెంకటప్పయ్య సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినాను కలిశారు. గుంటూరులోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో హెనీ క్రిస్టినాను కలిసిన వెంకటప్పయ్య ఈనెల 3వ తేదీన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆమెకు వివరణ ఇచ్చారు. ఇటీవల వినుకొండ మండలంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా దూషించిన అంశంపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వంలో భాగమేనని, వారితో హుందాగా నడుచుకోవాలని సూచించారు. స్థాయీ సంఘ సమావేశాలకు అన్ని శాఖల అధికారులతో పాటు విధిగా హాజరు కావాలని, ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా అమలు పర్చాలని స్పష్టం చేశారు.

కింది కోర్టు శిక్షను ఖరారు చేసిన సుప్రీంకోర్టు

తెనాలిరూరల్: జిల్లా, హైకోర్టులు విధించిన శిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. కింది కోర్టులు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆదేశించింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొల్లిపరకు చెందిన తమ్మా ఉషారాణి, ఆమె మరిది తమ్మా వెంకటకృష్ణారెడ్డికి ఆస్తి విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఉషారాణి సాగు చేస్తున్న అరటి, కంద పంటను 2010లో కృష్ణారెడ్డి కోసుకుని తీసుకెళుతుండగా ఆమె అడ్డుపడింది. ఆమెపై దాడి చేయగా పోలీసులను ఆశ్రయించింది. కొల్లిపర పోలీసులు కేసు నమోదు చేయగా, 11వ అదనపు జిల్లా కోర్టులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. జిల్లా కోర్టు తీర్పును సవాలు చేస్తూ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, కింది కోర్టు శిక్షను న్యాయస్థానం ఖరారు చేసింది. హైకోర్టు తీర్పునూ సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లగా అక్కడా కింది కోర్టు శిక్షను అమలు చేయాలని తీర్పు వచ్చింది. కృష్ణారెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్టు కొల్లిపర ఎస్ఐ ఆర్.రవీందర్‌రెడ్డి తెలిపారు.

యార్డులో 1,15,459 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,18,338 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,459 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,061 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా శ్రీవారి కల్యాణమహోత్సవం
- తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిన భక్తజనం





స్వామి వారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్) శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామి రాత్రి ఎదుర్కోల ఉత్సవం జరుపుకొని అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణ వేదికపైకి వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. అప్పటికే వేలాదిగా కల్యాణ వేదిక వద్దకు చేరుకున్న భక్తులు స్వామివారిని తిలకించి పునీతులయ్యారు. అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఉత్సవానికి శాశ్వత కైంకర్యపరులుగా గుంటూరు జిల్లా శేకూరు గ్రామానికి చెందిన వాసిరెడ్డి సీతారామయ్య కుమారులు జయదత్తు, ప్రభునాథ్‌లు వ్యవహరించగా పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం తరఫున అవ్వార్ వాచ్ కంపెనీ శరత్‌బాబు అందజేసిన మధుపర్కాలు, మంగళ ద్రవ్యాలను స్వామి వారికి అందజేశారు. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంత పద్మనాభాచార్యులు, ఉప ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు నిర్వహించగా, కల్యాణం వ్యాఖ్యాతగా గుంటూరు హిందూ కళాశాల సంస్కృత లెక్చరర్ దీవి నరసింహదీక్షితులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి.

నేడు మంగళాద్రి తిరునాళ్ల

పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి దివ్య రథోత్సవం మంగళవారం వైభవంగా జరగనుంది. మంగళాద్రి తిరునాళ్లగా ప్రసిద్ధి కెక్కిన రథోత్సవానికి లక్షకుపైగా భక్తులు హాజరవుతారని అంచనా. రథోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రాత్రి కల్యాణ మహోత్సవం అనంతరం స్వామి వారికి మంగళవారం ఉదయం బంగారు గరుడోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం అన్న సమారాధన అనంతరం మూడు గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం ప్రారంభమవుతుంది. తిరునాళ్ల సందర్భంగా 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మహిళలు ఉన్నతంగా రాణించాలి

– హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు, చిత్రంలో జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, పీడీజే పార్థసారథి, జీబీఏ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వర్లు

గుంటూరులీగల్: మహిళలు ఉన్నతంగా రాణించి హక్కులను సాధించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్టుపోలియో న్యాయమూర్తి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి జీబీఏ లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప అంతర్జాతీయ మహిళా దినోత్సవం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా జడ్జిలు, సబ్ కోర్టు జడ్జిలు, మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తులు, జీబీఏ ప్రెసిడెంట్ పాలడుగు వెంకటేశ్వర్లు, జీబీఏ కార్యవర్గం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఘన స్వాగతం

గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొనేందుకు గుంటూరు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపలకు సోమవారం సాయంత్రం అధికారులు ఘన స్వాగతం పలికారు. రహదారులు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, నాలుగో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రామగోపాల్, రెండు, మూడు అదనపు జిల్లా కోర్టుల జడ్జిలు సత్యవతి, అర్చన, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నకుమార్, ఒకటవ ఏఎంఎం, ప్రోటోకాల్ జడ్జి జియావుద్దీన్, గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 543.40 అడుగుల వద్ద ఉంది. ఇది 195.4548 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,040, ఎడమకాలువకు 8,807, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 21,367 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,673 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 822.60 అడుగుల వద్ద ఉంది. ఇది 42.8047 టీఎంసీలకు సమానం.

ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్

- పల్నాడు జిల్లా లింగంగుంట్లలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- ఈ నెల 15 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్టు వెల్లడి
- అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు



సీఎం సభాస్థలి ప్రదేశాన్ని ఉన్నతాధికారులతో కలసి పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఈ నెల 15వ తేదీన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించేందుకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులతో కలసి గ్రామంలో సోమవారం పర్యటించారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సందర్శించి సభ ఏర్పాటుకు సమీపంలోని పంట పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారని చెప్పారు. ఈ నేపథ్యంలో 15వ తేదీన లింగంగుంట్ల గ్రామానికి సీఎం విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు కల్పించాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి ఈ కార్యక్రమం పుట్టిందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అమలుకు అన్ని వనరులు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అవసరమైన అన్ని రకాల మందులు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పెంచినట్లు వెల్లడించారు. అన్ని మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రజిని కోరారు. సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్ర, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శోభారాణి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు ఆలస్యంగా వస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరువెస్ట్: ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రధానమైన వేదికకు కొందరు అధికారులు గైర్హాజరుకావడం, ఆలస్యంగా రావడం మానుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వారం వచ్చే అర్జీల పరిష్కారం దాదాపు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పరిష్కారంకాని వాటిని తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో వచ్చే బాధితుల అర్జీలు యుద్ధప్రాతిపదికపై పరిష్కరించాలన్నారు. ఆలస్యమైతే వారి ప్రాణాలకే ముప్పువాటిల్లే ప్రమాదముందని చెప్పారు. మొత్తం అందిన 139 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా అధికారులు పరిశీలించారు. కొన్ని ఫిర్యాదులు ఇలా...

ఉద్యోగం నుంచి తొలగించారు..



స్విమ్స్‌లో 2019 నుంచి మొత్తం 106 మంది సెక్యూరిటీ గార్డ్స్‌గా పనిచేస్తున్నాం. ఇటీవల మాలో 85 మందిని విధుల నుంచి తొలగించారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్, ఆసుపత్రి ఉద్యోగి మాకు అన్యాయం చేశారు. న్యాయం చేయండి.

–మంగళగిరి ఎయిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది

కార్మిక శాఖ భూమిని కాపాడండి



గుంటూరులోని కాకుమాను వారి తోటలో కార్మిక శాఖకు 14 ఎకరాల భూమి ఉంది. అందులో ఆరెకరాలు ప్రభుత్వాసుపత్రికి కేటాయించారు. దానిని వెంటనే ప్రారంభించి, మిగిలిన భూమికి ఫెన్సింగ్ ఏర్పాటుచేసి వాకింగ్ ట్రాక్‌గా మారిస్తే భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుంది. కొందరు స్థానిక పెద్దలు ఆ భూమిపై కన్నేసి కబ్జా చేసే ప్రయత్నంలో ఉన్నారు. అధికారులు గుర్తించాలి.

–కోట మాల్యాద్రి, సీపీఐ నగర కార్యదర్శి

జోనల్ ఇన్‌చార్జుల నియామకం

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల జోనల్ యువజన విభాగ ఇన్‌చార్జిగా మచిలీపట్నంకు చెందిన పేర్ని వాకా సాయికృష్ణమూర్తి, రైతు విభాగానికి అవనిగడ్డకు చెందిన కె.నరసింహారావు, బీసీ విభాగానికి విజయవాడ ఈస్ట్‌కు చెందిన కె.దుర్గారావుగౌడ్, వైఎస్సార్‌టీయూసీ విభాగానికి నంబూరు ప్రదీప్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగానికి జగ్గయ్యపేటకు చెందిన మార్కపుడి గాంధీ, ఎస్టీ విభాగానికి విజయవాడకు చెందిన మనుపాటి చిరంజీవి, మైనార్టీ విభాగానికి మచిలీపట్నంకు చెందిన షేక్ సిలార్‌దాదా, విద్యార్థి విభాగానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బి.విఠల్, వికలాంగుల విభాగానికి గుడివాడకు చెందిన దొండపాటి మధుకిరణ్, సేవాదళ్ విభాగానికి విజయవాడకు చెందిన షేక్ అమిత్, డాక్టర్స్ విభాగానికి డాక్టర్ షేక్ మహబూబ్, వాణిజ్య విభాగానికి విజయవాడకు చెందిన నాలం నాగేశ్వరరావు, సాంస్కృతిక విభాగానికి గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన షేక్ హసన్, ప్రచార విభాగానికి గన్నవరానికి చెందిన మద్దు శివ రామకృష్ణ, మహిళ విభాగానికి విజయవాడకు చెందిన కొత్తపల్లి రజిని, గ్రీవెన్స్ విభాగానికి నందిగామకు చెందిన మూలె నాగిరెడ్డి, చేనేత విభాగానికి విజయవాడకు చెందిన వనపల్లి త్రిమూర్తులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలో పలు పదవులు కేటాయించారు. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లా వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఆవుల సుందరరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మాదా రాధాకృష్ణమూర్తిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చీకటీగల పాలెం వద్ద గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నా యి... చిలకలూరిపేట నియోజకవర్గం మురికిపూడి గ్రామానికి చెందిన పోతురాజు చెంచయ్య (41), కుప్పనబోయిన వీరయ్య (45)లు ద్విచక్రవాహనంపై వినుకొండ నియోజకవర్గం ఈపూరు గ్రామంలో ఆదివారం జరిగిన ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లలో ప్రభ లైటింగ్ పనికి వచ్చా రు. అక్కడ పని ముగించుకొని వినుకొండకు వచ్చారు. మరుసటి రోజు పని నిమిత్తం విను కొండ నుంచి దొనకొండ సమీపంలో గల మునగపాడు బయలుదేరారు. ఈ సమయంలో చీకటీగల పాలెం బ్రిడ్జి వద్ద వరికోత మిషన్‌ను తీసుకొస్తున్న లారీ, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరూ మృతిచెందా రు. మృతదేహాలను ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు చెంచయ్యకు భార్య, ఇద్దరు కుమారులు కోటేశ్వరరావు, రవితేజ, మరో మృతుడు కుప్పనబోయిన వీరయ్యకు భార్య, ఇద్దరు కుమారులు మణికంఠ, రవితేజలు ఉన్నారు. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయి.

మెడికో.. ట్రెడిషనల్ మేకోవర్





రోగుల నాడి పట్టడం నేర్చుకుంటున్న వైద్య విద్యార్థులు.. తెలుగింటి పల్స్‌ని ఇట్టే పట్టేశారు. పరికిణీ, చీర కట్టులో విద్యార్థినులు హొయలొలికితే.. పంచెలు, ఖద్దర్ చొక్కాలతో విద్యార్థులు దర్పం ప్రదర్శించారు. గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సోమవారం జరిగిన అలంకిర్త్–23, ఎత్నిక్ డే ఉత్సాహంగా సాగింది. ట్రెడిషనల్ మేకోవర్‌తో.. మెడికోలు అతిథుల హార్ట్‌బీట్ పెంచేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

కారంచేడు: బియ్యం అక్రమార్కులు రోజురోజుకీ మితిమీరిపోతున్నారు. నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉన్నా కళ్లుగప్పి ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలోని ఒక రైస్ మిల్లులో అక్రమ రేషన్ బియ్యం నిల్వలున్నట్లు అందిన సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఆదివారం అర్ధరాత్రి తరువాత జరిగిన ఈ దాడుల్లో సుమారు 600 బ్యాగ్‌ల బియ్యం రాసులుగా పోసి ఉన్నట్లు గుర్తించారు. అధికారులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో ఈ దాడులు చేశారు.

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు


జంతు ప్రేమికులతో సమావేశమైన మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు వీధి కుక్కల వలన సమస్యలు తలెత్తకుండా నగర పాలక సంస్థ పటిష్ట చర్యలు తీసుకోనున్నదని, వారం రోజుల్లో నగరంలోని వీధి కుక్కలకు మాస్ యాంటి ర్యాబిస్ వ్యాక్సినేషన్ చేయించేందుకు చర్యలు తీసుకున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సోమ వారం మేయర్ చాంబర్‌లోకమిషనర్ కీర్తి చేకూరి, పశు సంవర్ధక శాఖ అధికారులు, నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు, జంతు ప్రేమికులతో కలిసి వీధి కుక్కల నియంత్రణ, ర్యాబిస్ వ్యాక్సినేషన్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో వీధి కుక్కల వలన వచ్చే సమస్యలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, త్వరలో ఈ సమస్య పరిష్కారమయ్యేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ చేసేలా మాస్ డ్రైవ్ చేపట్టనున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో సుమారు 20 వేలకు పైగా ఉన్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయటానికి ఇద్దరు పశు వైద్యులను కేటాయించాలని పశుసంవర్ధక శాఖకు లేఖ రాశామని, త్వరలో వైద్యులను కేటాయిస్తారన్నారు. సమావేశంలో ఎం.హెచ్.ఓ భాను ప్రకాష్, ఎస్ఎస్ లు రాంబాబు, ఆనంద్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారులు, జంతు ప్రేమికులు సురేష్ కుమార్ జైన్, ప్రదీప్ కుమార్, సురేష్ జాగు, తేజోవంత్, నరసింహా రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఉరివేసుకున్న దంపతులు

- ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందిన భార్య
- భర్తను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు


మృతురాలు సుకన్య

నిజాంపట్నం: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, భర్తలు ఉరివేసుకున్న సంఘటన మండలంలోని ఆముదాలపల్లి ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆముదాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కట్టుపల్లి సుకన్య (26), భర్త ప్రవీణ్‌లకు 11 సంవత్సరాల క్రితం వివాహమైంది. సోమవారం భార్య, భర్త ఇద్దరూ గొడవపడ్డారు. భర్త ప్రవీణ్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సమయంలో సుకన్య ఇంట్లో ఉరి వేసుకుంది. మరికొద్ది సేటికే భర్త ప్రవీణ్ ఇంటి చావిట్లో ఉరివేసుకుని ఆత్మహత్యా యత్నం చేశాడు. స్థానికులు చూసి వీరిద్దరినీ ఆటోలో నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. సుకన్య వైద్యశాలకు తీసుకువెళ్లేలోపే మృతి చెందింది. ప్రవీణ్‌ను మెరుగైన చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్ళారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి

- జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక


మహిళ సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు (క్రైం)

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక-స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనకు వచ్చే ఫిర్యాదిదారుల అర్జీలను నిర్ణీత వేళల్లో పరిష్కరించాలని ఎస్పీ జూమ్ ద్వారా పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీ ప్రకాష్‌బాబు (క్రైం)లు కూడా అర్జీలు స్వీకరించారు. సోమవారం స్పందనకు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.

● వాచ్‌మెన్, ఉమెన్‌లకు రక్షణ కల్పించాలి

గుంటూరు నగరంలోని వాచ్‌మెన్/ ఉమెన్‌లకు రక్షణ కల్పించాలి. ఈనెల 1న గుంటూరు నగరంలో జరిగిన ఇద్దరి వాచ్‌మెన్ల హత్యల దృష్ట్యా విధులు నిర్వర్తించాలంటే ప్రాణభయంగా ఉంది. ఇటువంటి ఘటనలు పునరావృతంకాకుండా పటిష్టమైన రక్షణ చర్యలు ద్వారా రక్షణ కల్పించాలి. రాత్రివేళల్లో గస్తీ నిర్వర్తించే పోలీస్ సిబ్బంది ద్వారా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లకు అనుసంధానంగా రక్షణ చర్యలు చేపట్టాలి. హత్యకు గురైన ఇద్దరు వాచ్‌మెన్ల ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షలు, ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలి. హత్యలు చేసిన వారిని ఉరిశిక్ష విధించాలి.

– సీహెచ్.మంగాదేవి, ఎం.జేమ్స్, వి.జోజిబాబు, సీహెచ్.వాసు, ఆర్.జయనద

● యూఎస్‌ఏ వెళ్లాలంటూ మోసం!

గతేడాది పొన్నూరు మండలంకు చెందిన ఓ ఫైనాన్సియర్‌ను తెలిసిన స్నేహితుడు పరిచయం చేశారు. తన కుమారుడిని యూఎస్‌ఏ పంపించేందుకు రూ.5 లక్షలు అవసరమని, వారం రోజుల్లో తిరిగి చెల్లిస్తానని బ్యాంక్‌లో జమ చేయాలని కోరాడు. దీంతో తాను గతేడాది సెప్టెంబర్ 21న ఆన్‌లైన్ బ్యాంక్ ఖాతా ద్వారా అతనికి పంపించా. నెలలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడంతో పలుమార్లు అడిగినా ఫలితం లేదు. అదేమని అడిగితే పోలీస్ శాఖలో తెలిసిన వారున్నారంటూ బెదిరిస్తున్నాడు. అతని బారినపడి పలువురు మోసపోయారు.. వారికి కోట్లల్లో చెల్లించాల్సి ఉంది. నాకు న్యాయం చేయండి.

– కె.శ్రీనివాసరావు, వ్యాపారి, అప్పికట్ల, బాపట్ల జిల్లా

● ఘరానా మోసం!

గత రెండేళ్ల మిర్చి ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటా. పరిచయం ఉన్న మహారాష్ట్ర వాసి మిర్చి కావాలని అడిగాడు. దీంతో రైతులు, ఓ ఎక్స్‌పోర్ట్ నుంచి మిరపకాయలు కొనుగోలు చేసి మహారాష్ట్ర వాసికి గత నెల 15న పంపించా. అయితే గుంటూరులోని ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన వ్యక్తి, మహారాష్ట్ర వాసి కుమ్మక్కై, రూ.22.27 లక్షలకు మోసగించారు. డబ్బులు చెల్లించకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిపై నల్లపాడు పీఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదు. ఫిర్యాదు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయలేదు. సదరు వ్యక్తులను పిలిచి న్యాయం చేయాలి.

– డి.నాగేశ్వరరావు, మిర్చి వ్యాపారి, నగరంపాలెం

పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగం తప్పనిసరి

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చి అమలు చేస్తుందని వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు పని చెయ్యాలని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సూచించారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్‌పీలతో ఆర్జేడీ, డీఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఈఓ జి.వెంకటేశ్వర్లు, ఎంఈఓలు నవిన్‌కుమార్, పులి లాజర్ ఆయన వెంట ఉన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధచూపాలి

జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి


మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దు.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటుంది అంటూ సూచించారు జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐపీఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఒమెగా ఆసుపత్రి సంయుక్తంగా సోమ వారం డీపీఓ ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, క్రమ తప్పకుండా వ్యాయామం, యోగ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మాట్లాడుతూ మహిళలు సంపూర్ణమైన ఆరోగ్యంతో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, పురుషులతోపాటు మహిళలు పోటీపడుతున్నారని వివరించారు. మహిళల భద్రత, సంక్షేమ కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు.

ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించే మహిళల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మహిళలకు సాధారణ ఆరోగ్య సమస్యలు, జీవనశైలి వల్ల వచ్చే వ్యాధులతోపాటు క్యాన్సర్‌కు అత్యాధునిక పరికరాలతో వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం మహిళా పోలీసులు, సచివాలయాల మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు క్యాన్సర్, సాధారణ చెకప్‌లు, బీపీ, రక్త పరీక్షలు, మధుమేహం, విటమిన్ డి3, స్కానింగ్, ఈసీజీ, ఎముకల సాంద్రత తదితర పరీక్షలు నిర్వర్తించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ యూనిట్ వైద్యురాలు మంజుల, ఒమేగా ఆసుపత్రి వైద్యులు, ఏఎస్పీ కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీ (ఏఆర్) చంద్రశేఖర్‌రావు, ఆర్‌ఐలు థామస్ రెడ్డి, రాజారావు, రాఘవయ్య, రమేష్ కృష్ణన్ పాల్గొన్నారు.

విజ్ఞాన వేదికగా అకడమిక్ ఎగ్జిబిషన్

- వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- అకడమిక్ ఎగ్జిబిషన్ ఎవేర్‌నెస్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, కోఆర్డినేటర్ ఆచార్య కె మధుబాబు

ఏఎన్‌యూ: విజ్ఞానం, నూతన ఆవిష్కరణలకు వేదికగా అకడమిక్ ఎగ్జిబిషన్-2023 నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న అకడమిక్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన ఎవేర్‌నెస్ క్యాంపెయిన్ పోస్టర్‌ను సోమవారం వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకుల మేథస్సులో ఉన్న నూతన అంశాలు, ఆవిష్కరణలను ప్రదర్శించడంతోపాటు వాటిపై పరస్పరం చర్చించుకునేందుకు అకడమిక్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తుందన్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్ కోఆర్డినేటర్, యూనివర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ 'గ్లోబల్ సైన్స్ ఫర్ హ్యూమన్ వెల్‌బీయింగ్' అనే అంశంపై ఈ విడత ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ అకడమిక్ ఎగ్జిబిషన్‌కు యూనివర్సిటీ పరిధిలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సుల కళాశాలలు, పాఠశాలల నుంచి 35 వేల మందికి పైగా హాజరుకానున్నారని తెలిపారు. పలు అంశాలపై 400కు పైగా ప్రదర్శనలు, నూతన ఆవిష్కరణలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ప్రమీలారాణి, ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పి.జాన్సన్, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ జాతీయ స్థాయి జట్టుకు ఫణిదం విద్యార్థి


నాగార్జున

సత్తెనపల్లి: జాతీయ స్థాయి అండర్ -14 కబడ్డీ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి డి.నాగార్జున ఎంపికయ్యాడు. చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్ -14 బాలుర విభాగంలో నాగార్జున అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరగబోయే అండర్ -14 కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జాతీయ క్రీడల్లో ఎంపిక కావడానికి కష్టపడి సాధన చేసిన విద్యార్థి నాగార్జునను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నయ్యలను ప్రత్యేకంగా అభినందించారు.

తెనాలిలో బేలుదారు కూలీ హత్య


అంకారావు మృతదేహం

తెనాలి రూరల్: పట్టణంలో బేలుదారు కూలీ పనులకు వెళ్లే వ్యక్తి హత్యకు గురయ్యాడు. తనతో పాటు పనులకు వచ్చే మరో కూలీ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... వినుకొండ మండలం గోకనకొండకు చెందిన గండికోట అంకారావు (40) కొన్నేళ్ల కిందట తన కటుంబంతో కలసి తెనాలి వచ్చి బేలుదారు పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తెనాలి బస్టాండ్ వంతెన నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో సుమారు నాలుగు నెలలుగా నివసిస్తున్న వేముల నాగరాజుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రతిరోజు సాయంత్రం మద్యం సేవిస్తుండే వారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అంకారావు నాగరాజు ఇంట్లో అతనితో కలసి మద్యం సేవిస్తున్నాడు. ఇద్దరి మధ్య వాదన జరగడంతో నాగరాజు కత్తిపీట చెక్కతో అంకారావుపై దాడి చేయగా అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావు తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి, మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

'బడుగు వికాసం' కింద బొలెరో కారు అందజేత



నరసరావుపేట: నిరుద్యోగ యువత క్రమశిక్షణతో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జేసీ ఎ.శ్యామ్ ప్రసాదు సూచించారు. నవోదయం కార్యక్రమంలో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న రాజుపాలెం మండలం, చోటపాపాయపాలెం గ్రామానికి చెందిన వంకుడువతు రాంబాబు నాయక్‌కు సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో బొలెరో వాహనం అందజేశా రు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద దరఖాస్తు చేసు కున్న లబ్ధిదారునికి పిడుగురాళ్ల స్టేట్ బ్యాంక్ ఇండియా అధికారులు వాహనం కొనుగోలు చేసేందుకు రూ.16.50లక్షల రుణం మంజూరు చేశారు. దీనిలో లబ్ధిదారునికి 45 శాతం సబ్సిడీ మంజూరవుతుందని నవోదయ నోడల్ అధికారి సంజీవరావు తెలిపారు. వాహనాన్ని కలెక్టర్, జేసీ లు ప్రారంభించారు.సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, జిల్లా ఎల్‌డీఎం వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి బీజే బెన్ని, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి, డీఆర్డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలు నాయక్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి వెంకటేశ్వరరావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గంగపుత్రులపై ప్రత్యేక దృష్టి

- ముత్తాయపాలెంలో బజరంగ్ ఫౌండేషన్ నేత్ర వైద్యశిబిరం
- 14 తీరప్రాంత గ్రామాల్లోని 702 మందికి పరీక్షలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి
- తీరప్రాంతాలకు మరిన్ని సేవలందిస్తాం: అంబటి మురళీకృష్ణ


సంక్షేమాంధ్ర రథసారథి సీఎం వైఎస్ జగన్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో అంబటి మురళీకృష్ణ

బాపట్లటౌన్: పేదల అభ్యున్నతికి జగన్నామ సంక్షేమం పేరుతో బజరంగ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో సోమవారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ అన్ని ఇంద్రియాల్లో నేత్రాలు అత్యంత ప్రధానమైనవన్నారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలకు ఉచిత నేత్రవైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యపరీక్షల అనంతరం వారం వ్యవధిలో అవసరమైన ప్రతి ఒక్కరికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా అందించడం హర్షనీయమన్నారు.

సీఎం జగన్ సంక్షేమ పాలనే స్ఫూర్తి..

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలననే స్ఫూర్తిగా తీసుకొని నిరుపేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక అనిర్వచనీయమైన భావోద్వేగంతో ఈ జగన్నామ సంక్షేమ సేవా సంవత్సరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఆరు శిబిరాలను ఏర్పాటు చేసి, సుమారు 6000 మందికి నేత్ర వైద్య సేవలను అందించామన్నారు. పేదరికం, నిరక్షరాస్యత వంటి సమస్యలతో సతమతమయ్యే గంగపుత్రులకు అండగా నిలవాలని బజరంగ్ ఫౌండేషన్ భావించి, బాపట్ల మండలంలోని తీర ప్రాంత గ్రామాలకు సేవలందించేందుకు ఈ శిబిరాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశామన్నారు. ఈ శిబిరంలో 14 తీర ప్రాంత గ్రామాల్లోని 702 మందికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి వచ్చే వారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఇంకో 43 శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా మొత్తంగా 51 సేవా కార్యక్రమాలను నిర్వహించి జగన్నామ సంక్షేమ సంవత్సరాన్ని పూర్తి చేస్తామన్నారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మరో రెండు మూడు శిబిరాలను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా శాసనసభ్యులు కోన రఘుపతి కోరిన మీదట, సాధ్యమైనంత త్వరలో ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి


నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరీక్ష ప్యాడ్లు, లంచ్ బాక్స్‌లు పంపిణీ..

జగన్నామ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్యశిబిరంతోపాటు పరిసర ప్రాంతాలలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లోని 620 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, 63 అంగన్‌వాడీ పిల్లలకు పలకలను, ఉపాధ్యాయులకు లంచ్ బాక్సులను, నారీ ఋతువు కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లోని 104 మంది కిశోర బాలికలకు శానిటరీ నాప్‌కిన్లను అందజేశారు. అనంతరం 25 మంది వలంటీర్లకు ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ, ధృతి సంస్థ నిర్వాహకుడు కళ్లం హరినాథ్ రెడ్డి, గ్రామపెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.